క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం సహాయ నిధి వరం లాంటిదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయా మండలాలకు సంబంధించిన 214 మంది లబ్ధిదారులకు రూ.72 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరావు, నాయకులు నకిరేకంటి ఏసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, పెద్ది సుక్కయ్య,గుడి పాటి లక్ష్మీనర్సింహ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు ఆర్థిక సాయం



శరత్‌కు నగదు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బొజ్జ శరత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడి చికిత్స నిమిత్తం గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ స్వామి లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లోడె సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పాకాల ఉపేందర్, కోశాధికారి పాలకూరి రాకేష్, సభ్యులు మెట్టు అచ్చాలు, వలిగొండ సత్యనారాయణ, మెట్టు నాగశంకర్, నందిపాటి మహేష్, మల్లేష్, బాలరాజు పాల్గొన్నారు.

ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన



నకిరేకల్ ఎస్సీ కాలనీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్వప్నరవీందర్

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో ఉన్న ఎస్సీ కాలనీలో గురువారం ముత్యాలమ్మ పండుగ నేపథ్యంలో స్థానిక వార్డు కౌన్సిలర్ దైద స్వప్న, టీపీసీసీ నేత దైద రవీందర్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించే పనులు చేపట్టారు.

ఆలయంలో పూజలు

కనగల్: దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మ వారికి మంగళవారం అర్చకులు విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవం, శాంతి కల్యాణం తిలకించి కుంకుమార్చనలు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నార్కట్‌పల్లి: విద్యుదాఘాతంతో చూడి గేదె మృతిచెందిందింది. ఈ ఘటన మండలంలోని మాదవ ఎడవెల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బక్కతట్ల యాదయ్య వ్యవసాయంతో పాటు గేదెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే మంగళవారం యాదయ్య భార్య శశిరేఖ తన కున్న గేదెలను తోలుకుని సమీపంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లింది. ఈ క్రమంలో గేదె మేసుకుంటూ వెళ్లి అప్పటికే తెగి ఉన్న విద్యుత్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు లబోదిబోమంటున్నాడు.

చివరి భూములకు నీరందిస్తాం



వరదకాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారి

వేములపల్లి (మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలో ఉన్న వరదకాల్వ పరిధిలోని చివరి భూములకు నీరందిస్తామని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దాచారం వద్దగల 65వ నంబర్ కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదకాల్వకు గండి పడడంతో దిగువకు నీటి విడుదల చేయడంలో ఆలస్యమైందని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీరు సమృద్ధిగా ఉందని, వరదకాల్వ ద్వారా మండలంలోని చెరువులను నింపి, చివరి రైతులకు నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ విశలీశ్వర్, జేఈ జితేందర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వన మహోత్సవం

- మునుగోడు మండలంలో 1.34లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 64 శాతం పూర్తి
- ఆగస్టు చివరిలోగా లక్ష్యాన్ని పూర్తి చేస్తామంటున్న అధికారులు



వెల్మకన్నెలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయిస్తున్న అధికారులు

మునుగోడు: రోజు రోజుకూ వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు కారణం మొక్కలు లేకపోవడమేనని గుర్తించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం విరివిగా మొక్కలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దానిని విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ఆదేశించింది. దీంతో వారికి ఇచ్చిన లక్ష్యాని పూర్తి చేసేందుకు మడలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ముమ్మరంగా మొక్కలు నాటుతున్నారు.

ఇంటింటికీ 74వేల మొక్కలు పంపిణీ

మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో వనమహోత్సవంలో మొత్తం 1లక్ష 34వేల మొక్కలు నాటేలా లక్ష్యం ఏర్పాటు చేశారు. అందు కోసం మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రతి నర్సరీలో 5వేల చొప్పున 1.35లక్షల మొక్కలను పెంచారు. అందులో ప్రతి గ్రామంలోని ఇంటింటికీ 5 మొక్కల చొప్పున 74 వేల మొక్కలు పంపిణీ చేయాలి. అయితే అందులో ఇప్పటి వరకు 58వేల మొక్కలని ఇంటింటికీ పంపిణీ చేశారు. మిగిలిన మొక్కల్లో ఇప్పటి వరకు 44వేల మొక్కలను రోడ్లకు ఇరువైపులా నాటిస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు ప్రజలు అందరూ సహకరించాలి. కేవలం అధికారులు, ప్రజా ప్రతినిధులతో మొక్కలను పెంచలేం. మా కృషికి తోడు ప్రజల కృషి ఉంటే నాటిన ప్రతి మొక్కను బతికిస్తాం. ప్రజా ప్రతినిధుల సహకారం చాలా బాగుంది. మండలంలో ఇప్పటికే 64 శాతం మొక్కలు నాటించాం. మిగిలిన మొక్కలను ఆగస్టు చివరి వారం లోపు పూర్తిగా నాటిస్తాం.

–శ్రీనయ్య, ఏపీఓ, మునుగోడు

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం



సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నార్కట్‌పల్లి: పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గురుకుల పాఠశాలలు, విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో మంగళవారం పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గురుకులాల ఉపాధ్యాయులంతా పీఆర్‌టీయూ తెలంగాణ సంఘంలో సభ్యులుగా చేరారని సంఘం చిలుముల బాల్‌రెడ్డి తెలిపారు. సంఘంలో చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వ రశీదులను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐక్య గురుకులాల కన్వీనర్ గాదె లింగస్వామి, ప్రధాన కార్యదర్శి కొనిదెల శంకర్, గౌరవ అధ్యక్షుడు కందిమళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.యాదగిరిరెడ్డి, నాకులు కళింగచారి, ఆదిమళ్ల మణిరాజు, ఎండీ. ఇమాంకరీం, ఇరుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు గ్రహీతకు సన్మానం



రామును సన్మానిస్తున్న అధికారులు

పెద్దవూర: జిల్లా స్థాయి ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవార్డు పొందిన మండలంలోని చలకుర్తి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రమావత్ రామును మంగళవారం శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జిల్లా నుంచి కేవలం రమావత్ రాముకు మాత్రమే ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు వరించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ సుధీర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, అనూష, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎల్లయ్య, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

బురదమడుగులా పాఠశాల ఆవరణ

- తరగతి గదుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి



జెడ్పీ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కేతేపల్లి: కేతేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీటితో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు నిలిచింది. పాఠశాల ఆవరణ కంటే ప్రధాన ద్వారం వద్ద ఉన్న సీసీరోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు సాఫీగా బయటికి వెళ్లటం లేదు. దీంతో వర్షం కురిసినప్పుడల్లా ఆవరణ మొత్తం నీరు నిలిచి చిత్తడిగా మారుతుంది. ఈ పాఠశాల ఆవరణలోనే ప్రాథమిక పాఠశాల, ఎమ్మార్సీ కార్యాలయాలు ఉన్నాయి. విద్యార్థులు పాఠశాలలోని తరగతి గదుల్లోకి ఈ బురదనీటిలో నుంచి వెళ్లాల్సి రావటంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గంజాయి టెస్ట్ కిట్లతో నిరంతర తనిఖీలు : ఎస్‌ఐ

శాలిగౌరారం: గంజాయి తాగిన వారిని గుర్తించేందుకు ఇకపై గంజాయి టెస్ట్ కిట్లతో తనిఖీలు చేయనున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనఖీల్లో భాగంగానే గంజాయి టెస్ట్ కిట్లతో కూడా తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ద్రిచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం(ఆర్‌సీ) వెంట ఉంచుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రతీ వాహనదారుడు సహకరించాలని కోరారు.

పాఠశాల నిర్మించారు.. రంగులు వేయడం మరిచారు



రంగులు వేయకుండా ఉన్న మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మునుగోడు: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. కానీ నియోజకవర్గ కేంద్రమైన మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అందుకు విరుద్ధంగా ఉంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదులు పూర్తిగా శిథిలం కావడంతో 2021వ సంవత్సరంలో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.68 లక్షలు మంజూరు చేసి 8 తరగతి గదులు నిర్మించారు. కానీ నేటికీ ఆ తరగతి గదులకు రంగులు వేయలేదు. అంతే కాకుండా ఆ గదుల్లో విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ పాఠశాల పాతబడిన పాఠశాల వలె దర్శనమిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అదనపు తరగతి గదులకు రంగులు వేయడంతోపాటు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదించాలి

చండూరు(గట్టుప్పల్) : మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించే వరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మంగళవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కుల, చింతపల్లి లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లు నింపి సాగునీరు అందించే కీలకమైన డీపీఆర్‌ను ఆమోదించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. గట్టుప్పల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, ఖమ్మం రాములు, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, ముసుకు బుచ్చిరెడ్డి, కర్నాటి యాదయ్య, పసుపుల చెన్నయ్య, వాయిల్ల శంకరయ్య, కిన్నెర భిక్షమయ్య, గుంటూరు విశ్వనాథం, నల్లవెల్లి భిక్షం, బొబ్బల చంద్రయ్య, రబ్బాని, దుబ్బాక శంకరయ్య, రాములు, యాదయ్య పాల్గొన్నారు.



గట్టుప్పల్ మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీ జీవితం యువతకు ఆదర్శం

- డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్
- మాజీ ప్రధానికి ఘన నివాళి



నల్లగొండలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవితం యువతకు ఆదర్శమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ యువతకు రాజీవ్ గాంధీ స్ఫూర్తి అని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, జూలకంటి శ్రీనివాస్, కత్తుల కోటి, జూలకంటి సైదిరెడ్డి, నాంపల్లి భాగ్య, నాగమణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

చండూరు : దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని మంగళవారం చండూరులో పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, మంచుకొండ సంజయ్, కల్మికొండ జనార్దన్, నల్లగంటి మల్లేశ్, ఆంజనేయులు, బొమ్మరబోయిన సైదులు, సంకోజు బ్రహ్మం, పున్న ధర్మేందర్, ఐతరాజు మల్లేష్, పన్నాల లింగయ్య, గంజి వెంకటేశం, రాపోలు వెంకటేశం, జావిద్, రవి, వెంకన్న, కర్నాటి శ్రీను, గంటకంపు అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మర్రిగూడ : మండలంలోని అన్ని గ్రామాల్లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. దేశంలో ఐటీరంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, వెంకటంపేట బాలయ్య, నరసింహారెడ్డి, జంగిలి రవి, గంట యాదయ్య, పగడాల లింగయ్య, కొడాల అల్వాల్‌రెడ్డి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, శేఖర్, పంతంగి సుధాకర్, ఎడ్ల ముత్తయ్య, గ్యార వెంకటేష్, సిరిపంగి శ్రీను, భిక్షమాచారి, సిలివేరు యాదయ్య పాల్గొన్నారు.

మునుగోడు: రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, మాదగోని రాజేష్‌గౌడ్, మేడి యాదయ్య, ఆరేళ్ల సైదులు, మల్లయ్య, జంగిలి నాగరాజు, ముంత హేమంత్, యాదగిరి, శిరస్సు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పొట్లపల్లి రవి, ఏర్పుల నర్సింహ, మునుకుంట్ల భిక్షం, వెంకన్న, ఈదయ్య, లింగయ్య, బాలరాజు, మహేష్ పాల్గొన్నారు.



చిట్యాల: పెద్దకాపర్తిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిప్పర్తిలో..

తిప్పర్తి : భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతిని తిప్పర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాశం నరేశ్‌రెడ్డి నాయకులు ఆదిమూలం ప్రశాంత్, బద్దం సైదులు, సోమరాజు, రమేష్‌రెడ్డి, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చండూరు: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్ గౌడ్ తదితరులు



మర్రిగూడ: రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బంద్‌కు సహకరించాలి

మిర్యాలగూడ అర్బన్ : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం చేపట్టే భారత్ బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఉపసంహరించుకునే వరకు చేపట్టే పోరాటానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు బొప్పని నరగేష్, సురేష్, రామారావునాయక్, జోసెఫ్ పాల్గొన్నారు.

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో 45.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఇంచార్జి తహసీల్దార్ సత్తార్ మంగళవారం తెలిపారు. భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది రాత్రికి రాత్రే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భారీ వర్షానికి లోతట్టు భూముల్లోని వరి, పత్తిచేలు నీట మునగగా మరికొన్నిచోట్ల వరదనీటి తాకిడికి పంటచేల భూములు కోతకు గురయ్యాయి.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి

పిడుగుపాటుకు పాడిగేదె మృతిచెందింది. శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెంలో కప్పల చంద్రమ్మ ఇంటి సమీపంలోని పశువుల కొట్టం వద్ద ఉన్న వేపచెట్టుపై సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు పడింది. అదే వేపచెట్టుకు చంద్రమ్మ పాడిగేదె కట్టేసి ఉండటంతో పిడుగు ప్రభావానికి మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

మునుగోడులో రోడ్ల విస్తరణ గుబులు

- ప్రధాన రోడ్లను నాలుగులేన్లుగా విస్తరించేందుకు రూ.24కోట్లు మంజూరు
- ఎంత వెడల్పుతో విస్తరిస్తారో తెలపని అధికారులు
- తమ మడిగెలు కూల్చివేస్తారేమోనని వ్యాపారుల ఆందోళన



మునుగోడులో విస్తరణకు రోడ్డు మధ్యలో మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

మునుగోడు: మునుగోడు వాసులకు రోడ్ల విస్తరణ గుబులు పట్టుకుంది. నియోజకవర్గ కేంద్రంలోని ఇరుకు రోడ్లను నాలుగు లేన్లుగా విస్తరించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సంకల్పించారు. మునుగోడులోని ప్రధాన రహదారులైన నల్లగొండ –చౌటుప్పల్ రోడ్డు 2.4 కిలో మీటర్లు, మునుగోడు –నాంపల్లి 1.5 కిలో మీటర్ల వరకు నాల్గు లేన్లుగా విస్తరించడంతో పాటు రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం, ఫుట్‌పాత్, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎండీఆర్ నిధుల నుంచి రూ. 24కోట్లు మంజూరు చేయించారు. ఆ పనులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ విస్తరణకు రోడ్డు మధ్యలోనే మార్కింగ్ చేయిస్తున్నాడు. కానీ రోడ్డుకు ఇరువైపులా ఎన్ని ఫీట్ల మేరకు విస్తరిస్తారనే విషయాన్ని వెల్లడించడం లేదు. దీంతో వ్యాపారులు ఎక్కడ తమ దుకాణాలు కూల్చివేస్తారనే భయంతో ఉన్నారు. రహదారి అక్కడక్కడ కాస్త వంకరగా ఉన్నప్పటికీ రోడ్డు మధ్యలోనే మార్కింగ్ చేసి వెళ్తున్నారని, దీంతో తమకు నష్టం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు ఎంత విస్తీర్ణంలో జరుగుతుంది, మురుగు కాల్వలు ఏ స్థలంలో నిర్మిస్తారనే విషయాలను వివరించాలని దుకాణాల యజమానులు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా 33 ఫీట్ల మేర విస్తరిస్తాం

రహదారి మధ్యలో నుంచి ఇరువైపులా 33 ఫీట్లతో 66ఫీట్ల రోడ్డుని ఏర్పాటు చేస్తాం. అందుకు అవసరమైన కొలతలు ఇప్పటికే వేశాం. వాటితో పాటు రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణంతో పాటు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తాం. రోడ్డు విస్తరణలో ఏ ఒక్కరికి నష్టం కలగకుండా పనులు చేయిస్తాం. ఏ ఒక్కరూ ఆందోళన చెందొద్దు.

– శిరీష్,ఆర్‌అండ్‌బీ ఏఈ, మునుగోడు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



భోజనం వడ్డిస్తున్న వైద్యాధికారి సూర్యశిల్ప, లయన్స్ క్లబ్ సభ్యులు

శాలిగౌరారం: గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి సూర్యశిల్ప సూచించారు. శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన కక్కిరేణి నవీన్–జ్యోతి దంపతులు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సూర్యశిల్ప మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటూ సీజనల్ వ్యాధులు పొంచి ఉండటంతో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి మంగళవారం పీహెచ్‌సీకి వచ్చే గర్భిణులకు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణ, చార్టర్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రతినిధులు దునుక వెంకన్న, మురారిశెట్టి కర్ణాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.